ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 24 జనవరి 2025

అందుబాటులోకి మరింత ఇసుక!

నేటి నుంచి పట్టిసీమ పాయింట్ నుంచి సరఫరా

ఏలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానంలో మరింత ఇసుకను అందుబాటులోకి తెచ్చే దిశగా ఏలూరు జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు ఓపెన్ రీచ్‌ల ద్వారా జిల్లాలో ఇబ్రహీంపేట, వింజరం, చేబ్రోలు డిపోల ద్వారా జిల్లా అవసరాలకు ఇసుకను అందిస్తున్నారు. తాజాగా జిల్లాలో పోలవరం మండలం పట్టిసీమ డీ సిల్టేషన్ (నది లోపల పేరుకున్న) ఇసుక పాయింట్ నుంచి ఈ నెల 24వ తేదీ నుంచి ప్రజలకు ఇసుక అందుబాటులోకి ఉంచేందుకు యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇది గూటాల-1 గూటాల-2 పాత ఇసుక రీచ్‌లకు సమీపంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడ నుంచి పడవల ద్వారా కూలీలు ముగ్గురు లేదా ఎనిమిది మంది సభ్యులు కలిగిన సొసైటీల ద్వారా బయటకు ఇసుకను తీసుకొస్తారు. బుధవారం పొద్దుపోయాక కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇక్కడ 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనా. ఈ ప్రాతిపదికన రోజుకు 400 టన్నుల ఇసుకను నది నుంచి తీసి అమ్మకాలు చేయనున్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఒక టన్నుకు ధరను రూ.165గా డీసిల్టేషన్ చార్జీగా నిర్ణయించగా, అడ్మినిస్ట్రేషన్, జీఎస్టీ తదితర చార్జీలను కలుపుకుని వినియోగదారునికి టన్ను రూ.198కు అందనుంది. అయితే ఈ ధర రూ.221 వరకు పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీసీ కెమెరాల ద్వారా పట్టిసీమ ఇసుక పాయింట్‌ను పర్యవేక్షించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుకను అందివ్వనున్నారు. ఇక్కడ ఇసుక పాయింట్‌లో పడవల లభ్యత సామర్థ్యం ఆధారంగా రోజుకు 400 టన్నుల వరకు ఇసుక ఉత్పత్తి, సరఫరా పరిమితి విధించారు. దీనిపై మైనింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ర్యాంపును పరిశీలించిన ఆర్డీవో

పోలవరం : మండలంలోని పట్టిసీమ ఇసుక ర్యాంపును జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ గురువారం పరిశీలించారు. శుక్రవారం నుంచి ఇసుక ర్యాంపు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్డీవో పట్టిసీమలో బోట్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడి ఇసుక తరలింపు సేకరణ విషయంలో పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రెండో రోజు జేఈఈకి తొమ్మిది మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షకు వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం 180 మంది చొప్పున విద్యార్థులను కేటాయించగా 178, 179 మంది చొప్పున హాజరయ్యారు. సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం సెషన్‌కు 112 మందికి 106, మధ్యాహ్నం సెషన్‌కు 107 మందికి అందరూ హాజరయ్యారు. మొత్తంమీద తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

కాల పరీక్ష!





ఇద్దరూ సీనియర్లే.. అయినా ప్రాధాన్యతలో ఒడిదుడుకులు

- సుదీర్ఘ అనుభవం కలిగిన మాగంటి బాబు తెరచాటుకు..
- ఉపముఖ్యమంత్రి హోదాలో పనిచేసిన ఆళ్ల నాని టీడీపీలో చేరేందుకు వెయిటింగ్
- తాజా రాజకీయాల్లో సరికొత్త ధోరణులు
- జిల్లాలో వీరిద్దరి రాజకీయ భవితవ్యంపై సర్వత్రా ఆసక్తి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాజకీయాల్లో ఓడలు బళ్లు, బళ్లు ఓడలవుతాయి. ఇదే క్రమంలో ప్రస్తుత రాజకీయాల్లోనూ అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానంలో అత్యంత కీలక వ్యక్తులుగా వ్యవహరించిన టీడీపీ సీనియర్ నేత మాగంటి బాబు, కాంగ్రెస్, వైసీపీల్లో తానే పెద్ద దిక్కుగా వ్యవహరించిన ఆళ్ల నాని పరిస్థితి ప్రస్తుతానికి ఇలాంటిదే.

మాగంటిపై కినుక ఎందుకు..

మాగంటిది రాజకీయాల్లో సుదీర్ఘ చరిత్ర. ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఆరు దఫాలు ప్రత్యర్థులను ఢీకొట్టేందుకు సాహసించిన సీనియర్ నేత. అప్పట్లో ఆయన ఎన్నికల్లో నిలబడితే విజయం ఖాయమనే నేపథ్యం. నియోజకవర్గాల్లో ఆయన కుటుంబీకులకు వున్న సంబంధాలు, బంధుగణం. అభిమానులకు అంతే ఉండేది కాదు. కాంగ్రెస్‌లో ఎంపీగా వ్యవహరించినప్పుడు ఏఐసీసీ అధిష్ఠానం పెద్దల వద్ద మాగంటి బాబు గుర్తింపు పొందారు. ప్లీనరీలో కీలకంగా వ్యవహరించి అనేక కమిటీలకు ఆయనే నాయకత్వం వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో వివాదం కారణంగా మంత్రి పదవి నుంచి ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలోకి మారారు. అక్కడ నుంచి ఏలూరు ఎంపీ స్థానానికే ఆయన వరుసగా పోటీ చేస్తూ వచ్చారు. 2019 ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన వైసీపీ అభ్యర్థి కోటగిరి శ్రీధర్‌పై పోటీ చేసి ఓటమి పొందారు. ఐదేళ్ల పాటు ఆయనకు రాజకీయంగా, కుటుంబ పరంగా అనేక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. కొందరు సొంతపార్టీ నేతలే ఆయనకు ప్రత్యర్థులుగా మారారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా కొన్నేళ్ల పాటు వ్యవహరించారు. ఒకవైపు పార్టీ తనను పట్టించుకోవడం లేదనే భావన అప్పట్లోనూ ఉండేది. దీనికి తగ్గట్టుగా నియోజకవర్గంలో కొందరు తనపై చెడు ప్రచారం చేస్తున్నా లైటుగా తీసుకున్నారు. ఇదే క్రమంలో ఆయన వరుసగా ఇద్దరు తనయులను కోల్పోయారు. ఈ షాక్ నుంచి దాదాపు కోలుకోలేక పోయారు. పార్టీ కీలక కార్యక్రమాల్లోనూ ఆయన ఈ కారణంగానే కొన్నింట్లో భాగస్వామి అయినా మరికొన్నింటికి దూరమయ్యారు. 2024 ఎన్నికల్లోనూ సీనియర్ నేత అయిన మాగంటిని తెలుగుదేశం కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. సామాజిక కోణంలోనే పార్టీ అభ్యర్థులను అటు లోక్‌సభ, ఇటు అసెంబ్లీ స్థానంలోనూ ఎంపిక చేసే సమయంలో కనీసం మాట వరుసకైనా పార్టీ సంప్రదించలేదని మాగంటి నొచ్చుకున్న సందర్భాలు లేకపోలేదు. ఏలూరు లోక్‌సభ స్థానం బాబుకే కేటాయించాలని ఆయన కుటుంబీకులు కొందరు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఆఖరికి ఎన్నికల ప్రచారంలోనూ ఆయనను పరిగణనలోకి తీసుకోలేదు. అయినా ఇప్పటికీ పార్టీని అంటిపెట్టుకునే వున్నారు. అన్ని పార్టీల నేతలతో వ్యక్తిగత పరిచయలున్న సీనియర్ నేత అయిన మాగంటిని టీడీపీ ఎందుకిలా పక్కన పెడుతుందని ఆయన సన్నిహితులు సందేహాలు వ్యక్తం చేస్తున్నా సమాధానం దొరకలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వా త కూడా మాగంటిని పక్కన పెట్టే టీడీపీ వ్యవహరించింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం వున్న మాగంటి తనకున్న సన్నిహితులతోనే ఇప్పటికీ పార్టీలో మన్నగలుగుతున్నారు. లోలోన పార్టీ పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి వున్నా ఆయన ఎక్కడా ఈ విషయాన్ని బయట పడకుండా చూసుకున్నారు.

అక్కడ ఎదిగి.. ఇక్కడకు వద్దామని..

రాజకీయాల్లో ఎవరికి ఒకే వైభవం అన్ని రోజులూ ఉండదు. ఇదే నానుడి ఆళ్ల నానికి వర్తించేలా ఉంది. ఏలూరు అసెంబ్లీలో అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయిన నాని గత రెండు దశాబ్దాల కాలంగా ఓసారి కాంగ్రెస్ లోనూ ఆ తర్వాత వైసీపీలోనూ ఎదుగుతూ వచ్చారు. ప్రత్యేకించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏలూరు నుంచి తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆళ్ల నాని అక్కడ నుంచి వరుసగా ఏలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తూ వచ్చారు. 2019 ఎన్నికల ముందు ఆయన వైసీపీ ఎమ్మెల్సీగా వ్యవహరించారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ గట్టి పట్టుపట్టడంతో వైసీపీ అగ్రనాయకత్వం అంగీకరించడంతో ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే పదవీకి పోటీ చేసి గెలుపొందారు. ఎవరూ ఊహించని స్థాయిలో ఆయన జగన్ మంత్రి వర్గంలో ఉపముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. అంతకు ముందు ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి అధ్యక్షుడిగా వ్యవహరించి వైసీపీ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. ఆది నుంచి వైఎస్సార్ కుటుంబంతో ఆయనకున్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో ఆయనకు కీలకమైన వైద్య ఆరోగ్యశాఖ కట్టబెట్టగా కరోనా సమయంలో వైద్య మంత్రిగా వ్యవహరించారు. ఒకదశలో ఆయన హోంమంత్రిగా ఎదిగే అవకాశాలున్నట్లు ప్రచారం సాగింది.

2023లో జరిగిన ఎన్నికల్లో ఆయన అత్యధిక ఓట్ల తేడాతో ఓటమి చెందారు. కొద్దినెలల క్రితం వైసీపీకి రాజీనామా చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాని టీడీపీలో చేరేందుకు అనుకూలంగా టీడీపీ నుంచి సంకేతాలు వెలువడగా ఏలూరు టీడీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. సోషల్ మీడియాలో వివిధ రకాల కామెంట్లను గుప్పించారు. టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే బడేటి చంటితో పార్టీ ముఖ్యులు చర్చించాల్సి వచ్చింది. ఏ కారణంగా నాని తీసుకోవాల్సి వస్తుందో ఆ విషయాన్ని ఎమ్మెల్యే చంటికి పార్టీ పెద్దలు వివరించే ప్రయత్నం చేశారు. అయినా వైసీపీలో ఉప ముఖ్యమంత్రి పనిచేసిన నాని టీడీపీలో చేరేందుకు తిప్పలు పడాల్సి వస్తోంది. నాని తాను కొత్త పార్టీలో చేరేందుకు అనువుగా ముహుర్తాలు నిర్ణయించడం ఒక ఎత్తు అయితే ఆ సమయం కుదరకపోవడం, ముఖ్యమంత్రి చంద్రబాబు బిజీగా వుండడంతో ఆయన టీడీపీలో చేరిక పదేపదే వాయిదా పడుతూ వస్తోంది. ఈ నెలాఖరున లేక వచ్చే నెల పార్టీలో చేరుతారా లేక రెండో వారంలో చేరుతారా అనేది ఓ ప్రశ్నగానే మారింది. ఆళ్ల నాని కూడా ఈ విషయంలో ఎక్కడా ఏ వ్యాఖ్యలు చేయకుండా ఇప్పటికీ గుంభనంగానే వున్నారు. టీడీపీ పెద్దలు ఆహ్వానం మేరకే తాను పార్టీలో చేరేందుకు నిర్ణయించినట్లుగా తనకు తెలిసిన వారివద్ద ప్రస్తావిస్తూనే తాను టీడీపీలో చేరిన ఏ ఒక్కిరికి పోటీ కాబోనని చెబుతున్నట్టు వినికిడి.

మాగంటి బాబు... ఏలూరు లోక్‌సభ పరిధిలో ఈ నేత పేరు వినని వారుండరు. తాత ముత్తాతలు, తల్లిదండ్రులదీ రాజకీయ నేపథ్యమే. ఆరుసార్లు ఇదే లోక్‌సభ స్థానం నుంచి నిర్వీరామంగా పోటీ చేసిన నేత. గెలుపోటములను చవిచూసిన నాయకుడు. చిన్నాపెద్దాకు అలవాటు పడిన మొహం. రాజకీయాల్లో ఒడిదుడుకులు చవిచూశారు. కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం పార్టీలోని అగ్రనేతలకు ఆయన చిరపరిచితుడు. కాని 2023లో జరిగిన ఎన్నికల్లో ఆయన అదృష్టం తిరగబడింది. టీడీపీ టిక్కెట్ ఇవ్వలేదు. ఆఖరికి ఎన్నికల సమయంలో, పార్టీ గెలిచిన తర్వాత కూడా సీనియర్ అయిన ఈయనను కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. ఆయన సేవలను వినియోగించుకోవా ల్సింది పోయి గాలికొదిలేశారు. ఇది న్యాయమా..? అనే ప్రశ్న టీడీపీ కేడర్‌లోనూ ఉంది.

ఆళ్ల నాని... వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి ఏలూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదుసార్లు పోటీ చేసి రెండు సార్లు ఓటమి చెందారు. కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి మారి అక్కడ కూడా వైఎస్ జగన్మోహనరెడ్డికి అత్యంత చేరువయ్యారు. ఆది నుంచి వైఎస్ ఫ్యామిలీకి ఆయన సన్నిహితుడే. ఏలూరు రాజకీయాల్లో ఓసారి మాగంటి వరలక్ష్మితో పోటీ పడ్డారు. ఎమ్మెల్యే స్థాయి నుంచి ఉపముఖ్యమంత్రి వరకు ఎదిగారు. పార్టీని శాసించినట్లుగా ఓసారి ఎమ్మెల్సీ పదవీ, రెండుసార్లు జిల్లా అధ్యక్ష పదవులను భుజానకెత్తుకున్నారు. ఇప్పుడాయన వైసీపీ నుంచి బయట పడి టీడీపీలో చేరేందుకు వెయిటింగ్‌లో ఉన్నారు.



అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పాదయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గౌరవార్థంగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి పాతబస్టాండ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా అవమానకరమైన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను, భారత ప్రజలను అవమానించినట్టేనని అన్నారు. ఏఐసీసీ జాయింట్ కార్యదర్శి, ఏపీ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ పాలక్‌వర్మ, జిల్లా ఇన్‌చార్జి సంజీవరెడ్డి, పీసీసీ జనరల్ కార్యదర్శి ఉన్నమట్ల ఎలీజా, గౌతు సత్యేంద్రబాబు, అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు నరసింహమూర్తి, నోబుల్, సుబ్బారావు, మారీడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



• హ్యాపీ బర్త్‌డే లోకేశ్..

జిల్లావ్యాప్తంగా గురువారం ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు హ్యాపీబర్త్‌డే లోకేశ్ అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు, పేదలకు వస్త్ర, అన్నదానాలు జరిపారు. ఏలూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్‌లు పాల్గొని కేక్ కట్ చేశారు.



• డిసెంబరుకు డయాఫ్రంవాల్ పూర్తి : మంత్రి నిమ్మల

పోలవరం ప్రాజెక్టును గురువారం రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. స్పిల్‌వే ప్రాంతాన్ని, నూతన డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతంలో జరుగుతున్న ప్లాస్టిక్ కాంక్రీటు పనులను పరిశీలించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. - మెయిన్‌లో



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ డి.పావని

డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించాల్సిందే..

చింతలపూడి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో డ్రెయినేజీలలో మురుగు పేరుకుపోయి ఉందని, దానిని తొలగించడానికి డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించడం తప్పదని మునిసిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. గురువారం ఆక్రమణ తొలగింపు కొనసాగించగా ఎక్స్‌కవేటర్‌తో తీయడం వల్ల డ్రెయిన్లపై రాళ్ల దెబ్బతింటున్నాయని, అవకాశం ఇస్తే తాము తొలగించుకుంటామని కొందరు ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె మాట్లాడుతూ ప్రతీ దుకాణం ముందు వెళ్లేందుకు దారి మాత్రమే రాళ్ళు ఉపయోగించుకోవాలని, మిగిలినది ఓపెన్ డ్రెయిన్‌గా ఉంచాలన్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

టీచర్ ప్రవర్తనపై విద్యార్థుల ఆందోళన

ముసునూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి ప్రవర్తనపై తొమ్మిదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట గురువారం ఆందోళన చేశారు. కొన్ని నెలలుగా లెక్కల టీచర్ పి.సుశీల దురుసుగా మాట్లాడడంతో పాటు ఇష్టానుసారంగా విద్యార్థులను కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, పద్ధతి మార్చుకోవాలని వారు హెచ్చరించినా పద్ధతి మారలేదని తల్లిదండ్రులు చెప్పారు. ఆమెను బదిలీ చేయాలని అంతవరకు ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. నూజివీడు డీవైఈవో సేవ్య, ఎంపీడీవో జి.రాణి పాఠశాల వద్దకు చేరుకుని ఈ ఆందోళనకు గల కారణాలను తెలుసుకున్నారు. పరిస్థితిని డీఈవో వెంకట లక్ష్మమ్మకు సమాచారం ఇచ్చారు. ఫిర్యాదులను డీఈవోకు పంపుతున్నట్టు తెలిపారు. ఆందోళనలో టీడీపీ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుదిదశకు సొసైటీల కంప్యూటరీకరణ

- రూ.12 కోట్లతో 158 సొసైటీల్లో పనులు
- కొలిక్కివస్తున్న ఆన్‌లైన్ లావాదేవీలు
- 40 శాతం పూర్తి... నెలాఖరుకు మిగిలినవి

ఏలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలంగా సహకార శాఖలో నలుగుతున్న సొసైటీల కంప్యూటరీకరణ ఎట్టకేలకు పూర్తయి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైసీపీ హయాంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసింది. రుణాలు అందుకోవడం, ఇతర సేవల్లో జాప్యంతో రైతులు అవస్థలు పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టులో కంప్యూటరీకరణ చేపట్టగా అది పూర్తయ్యే దశకు వచ్చింది. జిల్లాలో మొత్తం 159 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఉండగా, పైడిపాక సొసైటీ వ్యవహారం లిక్విడేషన్‌లో ఉంది. ఇది రద్దయ్యే అవకాశం. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో ఉండడం వల్ల ఇక్కడ లావాదేవీలు జరగవు. దీంతో 158 సహకార సంఘాల్లో పూర్తి కంప్యూటరీకరణకు గతేడాది ఆగస్టులో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అన్ని లావాదేవీలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస రావు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రైతులకు సత్వరం పారదర్శకంగా సేవలందించవచ్చని జవాబుదారీతనం ఉంటుందన్నారు.

నాబార్డు ఆర్థిక సహకారంతో జిల్లాలో సొసైటీల కంప్యూటరీకరణకు రూ.12 కోట్లు ఖర్చు చేశారు. సగటున ఒక్కో సొసైటీకి రూ.6 లక్షల వ్యయం అవుతోంది. నాలుగు దశల కింద కంప్యూటరీకరణ చేపట్టారు. మొదట దశగా హార్డ్‌వేర్ ద్వారా ఆయా సొసైటీల్లో 11 రకాల సమాచారం రికార్డులు, అందిస్తున్న సేవలను పోర్టల్స్‌ను లోడ్ చేశారు. రెండో విడతగా డీ మేగ్రేషన్ కింద రూ.3 లక్షల విలువైన డెస్క్‌టాప్ కంప్యూటర్లు, పాస్ మిషన్, ట్యాబ్,టచ్ స్క్రీన్లు కొనుగోలు చేసి అందించారు. సొసైటీల్లోని రికార్డులు, సభ్యత్వం తీసుకున్న వివరాలు, భూములు, డిపాజిట్ దారుల వివరాలను డిజిటలైజేషన్ చేశారు. మూడో విడతగా ఏప్రిల్ 1, 2024 నుంచి ఇప్పటి వరకు ఉన్న రికార్డులను అప్‌డేట్ చేశారు. నాలుగో విడతగా ఆన్‌లైన్ సేవలను అందించే ప్రక్రియ ఈ నెల 20 నాటికి 148 ప్రీ మైగ్రేషన్ పూర్తి కాగా, 139 సొసైటీల్లో వోచర్ల పోస్టింగులు జరుగుతున్నాయి. ఓవరాల్‌గా ఆన్‌లైన్ విధానంలో 48 సొసైటీల ద్వారా సేవలను అందిస్తున్నారు. మిగిలినవన్నీ ఈ నెలాఖరు నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. పనిలో పనిగా బినామీ రైతులను ఏరివేసేందుకు కంప్యూటరీకరణలో భాగంగా రైతుల ఖాతాలను ఈకేవైసీ చేసే ప్రక్రియ జోరందుకుంది. సొసైటీల్లో మొత్తం 1,68,895 మంది రైతులుండగా, వారిలో 1,31,150 మందికి ఈకేవైసీ చేపట్టారు. కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని డీసీసీబీ, డీసీఎంఎస్‌లు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ ధాత్రిరెడ్డి నిరంతం పర్యవేక్షణ చేస్తూ డీసీవో శ్రీనివాసరావుకు సూచనలు జారీ చేస్తున్నారు. కాగా ఆన్‌లైన్ విధానం అమలు పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో డీసీసీబీ సీఈవో, డీసీవో, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారులు, ముగ్గురు బ్యాంకు మేనే జర్లు నిరంతరం పర్య వేక్షణ చేస్తున్నారు.



శనివారపుపేట సహకార సొసైటీలో కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి(ఫైల్)

కాల్వలకు రాని నీళ్లు.. ఎండుతున్న మినుము చేలు



ములకలపల్లిలో వాడిపోతున్న మినుము పైరు

ముదినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మినుము పైరు ఎండిపోతున్నా కాల్వలకు నీరు వదిలే పరిస్థితి కనిపించడం లేదు. వేలాది రూపాయల పెట్టుబడితో ఇప్పటి వరకు పెంచిన మినుము పైరు నీరందక చేతికి దక్కే పరిస్థితి కనిపించడం లేదని రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు గగ్గోలు పెడుతున్నా జలవనరుల శాఖ అధికారులు కాల్వలకు నీటి విడుదల చేసే విషయంలో స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. పోల్‌రాజ్, క్యాంప్ బెల్, బంటుమిల్లి కాల్వలకు నీటి విడుదలను పూర్తిగా బంద్ చేయడంతో కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి, కైకలూరు మండలాల్లోని వేలాది ఎకరాల్లోని మినుము సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. నీరందక మినుము పైరుకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. పది రోజులుగా నీరందని పరిస్థితుల్లో నిన్నమొన్నటి వరకు పచ్చగా ఉన్న మినుము పైరు ఎండి వాడిపోతోంది. నీరందక పైరుకు నష్టం జరుగుతున్న విషయాన్ని కృష్ణా తూర్పు డెల్టా ఈఈ కొడాలి బాబు దృష్టికి తీసుకెళ్లగా, ప్రస్తుతానికి కాల్వలకు నీరు విడుదల చేసే అవకాశం లేదని తెలిపారు. పులిచింతలలో నీటిమట్టం సరిపడినంత లేనందున ఇప్పటికిప్పుడు నీటి విడుదలపై స్పష్టత ఇవ్వలేమన్నారు. ఆ ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగితే ఫిబ్రవరి మొదటి వారంలో నీరు విడుదల చేసే విషయాన్ని ఎస్ఈ పరిశీలిస్తున్నారని తెలిపారు. నీరందక నాలుగు మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లోని మినుము పైరుకు తీవ్ర నష్టం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారీ వర్షాల వల్ల సార్వా వరి పంటను కోల్పోయిన రైతులు ఇప్పుడు నీరందక రెండో పంటగా వేసిన మినుము పంట కూడా చేతికి దక్కే అవకాశాలు లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సురభి ఒక కుటుంబం

127 ఏళ్లుగా నాటక రంగానికి సేవలందిస్తున్న సంస్థ

అదరగొట్టే సెట్టింగ్‌లు, ఆకట్టుకునే కళాకారులు..

నాట్యమండలి డైరెక్టర్,నటుడు వేణుగోపాలరావుతో చిట్‌చాట్





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న వేణుగోపాలరావు

ఉండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నూట ఇరవై ఏడు సంవత్సరాలుగా సురబి నాటక సంస్థ కళా రంగానికి ఊపిరి పోస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన 40 మంది కళాకారులు తమ బతుకుతెరువు కోసం నాటకాలు వేసి ఇంతకాలం తెలుగు నాటకాన్ని బతికిస్తూ వస్తున్నారు. కళ్లకు కట్టినట్టుగా కళను ప్రదర్శించడమే సురభి నాటకాల ప్రత్యేకత. స్త్రీ, పురుష పాత్రలతో పాటు పిల్లలు కూడా నాటకాల్లో పాత్రలు వేస్తుంటారు. ఒక పక్క స్కూళ్లకు, కళాశాలకు వెళ్లి చదువుకుంటూ రాత్రులు నాటకాలలో నటిస్తూ ప్రేక్షకుల మన్ననలను అందుకుంటున్నారు. వినాయక నాట్యమండలి (సురబి) ప్రధాన కళాకారుడు, డైరెక్టర్ ఆర్.వేణుగోపాలరావును ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు చెప్పారు.. అయన మాటల్లోనే..

• సురభి సంస్థను ఎప్పుడు ప్రారంభించారు ?

1885సంవత్సరంలో కడప జిల్లాలో రాయచోటిలో సురబి సంస్థను ప్రారంభించారు. 1925లో పశ్చిమగోదావరి జిల్లా ఉండి-భీమవరంలలో ప్రత్తిపాటి నాగభూషణ శర్మ చేతుల మీదుగా శ్రీవినాయక నాట్యమండలి (సురబి) నేషనల్ థియేటర్‌ని స్థాపించాం.

• స్థాపించింది ఎవరు ?

వనరాస గోవిందరావు శ్రీకారం చుట్టారు. కీచకవధ నాటకం తొలి ప్రదర్శన. గతంలో 50 వరకు సంస్థలు వుండేవి. ప్రస్తుతం ఉన్నది మా సంస్థ ఒక్కటే. శ్రీవినాయక నాట్యమండలి మాత్రమే మిగిలి వుంది.

• ప్రస్తుతం ఎన్నోతరం నడుస్తోంది ?

ఎనిమిదో తరం నడుస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన 40 మంది సభ్యులు సురబి నాటకాలలో నటిస్తుంటారు. మూడేళ్ల పాప నుంచి 79 ఏళ్ల వృద్ధుల వరకు పాత్రలను పోషించి శభాష్ అనిపించుకుంటారు. ప్రస్తుతం 18 మంది స్రీలు, 25 మంది పురుషులు, ఏడుగుగురు పిల్లలు సంస్థలో ఉన్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో స్థిరపడ్డాం.. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలకు వెళుతుంటాం..

• ప్రత్యేక గుర్తింపు ఏమైనా లభించిందా?

మా నాటక ప్రదర్శనలకు గిన్నిస్ వరల్డ్ రికార్డు లభించింది. ముఖ్యంగా నాటకానికి అనుగుణంగా సెట్టింగ్‌లు వేయడం సురబి సంస్థ ప్రత్యేకత.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాస్త ప్రోత్సాహం అందిస్తున్నది. సినిమా, టీవీ, సెల్‌ఫోన్స్ వచ్చాక నాటకాలపై ఆసక్తి అంతగా ఉండడం లేదు. నాటక రంగ కళాకారులకు చాలా ఇబ్బందికరంగా మారింది.

• ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది ?

సురబి నాటకాలు చాలా బావుంటాయని ప్రజలు కితాబిస్తారు. గ్రామాల్లో ఇప్పటికీ ఆదరణ బావుంటుంది. నాటకాలను ఆసక్తిగా తిలకిస్తారు.. సెట్టింగ్‌లు, సన్నివేశాలను చూసిన వారు చప్పట్లతో ప్రోత్సాహం ఇస్తున్నారు.

• మీరు పొందిన పురస్కారాలు ?

జాతీయస్థాయిలో ఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్నా. ఆంధ్ర-తెలంగాణ ముఖ్య మంత్రులు, గవర్నర్లు చేతుల మీదుగా పలు పురస్కారాలు తీసుకున్నాను.

• ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది ?

ఆంధ్ర-తెలంగాణ ప్రభుత్వాలను ఎప్పటి నుంచో స్థలం అడుగుతున్నాం. రెండు ప్రభుత్వాలు ముందుకు వచ్చి సురబి నాటకాలను ప్రోత్సహించడానికి తమకు అండగా నిలవాలని ఆశిస్తున్నాం. అమరావతిలోనైనా స్థలం కేటాయిస్తే ఆ ప్రాంతంలో నాటకరంగ అభివృద్ధికి అవకాశం వుంటుంది.



మంత్రముగ్ధులను చేసిన శ్రీనివాస కల్యాణం

కోలమూరులో ముగిసిన సురభి నాటకాలు

ఉండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కళాభిమానులను శ్రీనివాసకల్యాణం నాటకం మంత్రముగ్ధులను చేసింది. మూడు రోజులుగా ఉండి మండలం కోలమూరులో సంతాన గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సురబి నాటక పౌరాణిక నాటక ప్రదర్శనలు గురువారం రాత్రితో ముగిశాయి. కలియుగంలో శ్రీమహా విష్ణువు శ్రీనివాసుడుగా అవతారమెత్తి పద్మావతిని పరిణయం ఆడతాడు.. ఈ నాట కంలోని పలు ఘట్టాలలో కళాకారుల ప్రద ర్శనకు మైమరచి చూశారు. చలిలో కూడా కదలకుండా తిలకించారు. గురువారం ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ సురబి కళాకా రులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కళలకు జీవం పోస్తున్న కళాకారులను అభినందించారు. చిన్నపుడు నాటకాలు ఎక్కడ ప్రదర్శించినా చూసేవారమన్నారు. కళాకారులకు అండగా వుంటామన్నారు.





పూర్వ విద్యార్థులతో పాఠశాల సిబ్బంది... పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వల్లూరు స్కూలుకు లక్షా 7 వేలతో ఏర్పాటు చేసిన ఫిజిక్స్ , జువాలజీ, బోటని ల్యాబ్

రూ.లక్షతో వల్లూరు స్కూల్‌కు ల్యాబ్

ఆచంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో లక్షా 7 వేల రూపాయలతో వల్లూరు జిల్లా పరిషత్ మహిళా జూనియర్ కళాశాలలో ల్యాబ్ ఏర్పాటు చేశారు. 1979-80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం కళాశాలను సందర్శించారు. వారి సహకారంతో ఫిజిక్స్, జువాలజి, ల్యాబ్ ఏర్పాటు చేశారు. బోటని ల్యాబ్ నిమిత్తం ముత్యాల చిట్టిబాబు రూ. 45 వేలు, ఫిజిక్స్ ల్యాబ్, ఫర్నీచర్ కోసం చావలి సీతారామారావు రూ. 25 వేలు విరాళాలను ఇచ్చి కళాశాల అభివృద్ధికి సహకరించారని పాఠశాల హెచ్ఎం ఎస్. నరసింహం అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను, దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి బేబి, ఎస్ఎంసీ చైర్మన్ జాన్స్ కుమార్, అభివృద్ధి కమిటీ సభ్యుడు నేలపూడి రామ్మోహనరావు పాల్గొనగా దాతలను జడ్పీటీసీ సురేష్ బాబు అభినందించారు.

పోలవరంలో మహారాష్ట్ర గన్‌లు

జోరుగా ప్లాస్టిక్ తుపాకీల అమ్మకాలు

కోతులు, పక్షుల బెడద తప్పించుకునేందుకు ఎగబడి కొన్న రైతులు, గ్రామస్థులు



ప్లాస్టిక్ గన్‌లు అమ్ముతున్న మహారాష్ట్ర వ్యాపారులు

పోలవరం జనవరి 23(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో గురువారం ప్లాస్టిక్ తుపాకీల అమ్మకాలు గ్రామస్థులలో కలకలం రేపాయి. ఏటిగట్టు సెంటర్‌లో భారీ తుపాకీ పేలుడు శబ్దాలు వినిపించడంతో తొలుత కంగారు పడ్డారు. తర్వాత విషయం తెలుసుకుని తుపాకీల కొనుగోలుకి ఎగబడ్డారు. పోలవరం మండలంలో కోతుల బెడదతో నివాసాలలో ఉండేవారు, పక్షుల బెడదతో వ్యవసాయదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకి చెందిన వ్యాపారులు గ్యాస్ వెల్డింగ్‌కి వినియోగించే కార్బన్ పదార్థంతో పేలి భారీ శబ్దం చేసే ప్లాస్టిక్ గన్‌లను అమ్మకాలు చేశారు. దీంతో కోతులు, పిట్టల బెడద నివారించడానికి గ్రామస్థులు, రైతులు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ తుపాకీలు కొనుగోలు చేశారు. ఒక్కో తుపాకీ 250 రూపాయలకు అమ్మారు.

ఢిల్లీ పిలిచింది



రిపబ్లిక్ డే వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం



ఎర్రకోటకు పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం

ఉమ్మడి పశ్చిమలో ఘనత సాధించిన ఏకైక గ్రామం

కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలు క్షేత్ర స్థాయిలో వందశాతం పేదలకు చేరవేయడంలో సఫలీకృతమైన గ్రామాలకు లభించే అరుదైన అవకాశం పెదతాడేపల్లి గ్రామానికి దక్కింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏకైక గ్రామ పంచాయతీగా నిలిచిన పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం ఈనెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు సతీ సమేతంగా రావాలంటూ ఆహ్వానం అందుకున్నారు. 6,581 మంది జనాభా ఉండే ఈ పంచాయతీలో 14 వార్డుల్లో 1,909 కుటుంబాలు, ఇద్దరు ఎంపీటీసీలు, 112 డ్వాక్రా సంఘాలున్నాయి. వీటిని సమన్వయం చేస్తూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి మాతృవందన, కిసాన్ క్రెడిట్ కార్డ్స్ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వంటి పథకాలు నూరు శాతం అమలు చేయడంలో కీలకంగా వ్యవహరించడంతో ఆయనకు ఈ అవకాశం లభించింది.

ఎంతో ఆనందంగా ఉంది..



ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడం మంచి అవకాశం. గ్రామ పంచాయతీలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారు. వారి కృషికి తగ్గట్టుగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడం మా బాధ్యత. ఈ గౌరవం మా ప్రాంత సర్పంచ్ లందరికీ దక్కినట్టు భావిస్తాను. గ్రామాభివృద్ధికి మరింత కట్టుబడి పనిచేస్తాను.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

98 వేల మంది పోటీ.. ప్రత్తిపాడు విద్యార్థినికి అవకాశం

విద్యార్థి దశ నుంచే సత్తా చాటి తమకు తామే సాటి అని చెప్పుకుంటున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. ఆ కోవలోకే వస్తుంది పెంటపాడు మండలం ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయలో 8వ తరగతి చదువుతున్న జవ్వాది రాహిణి. .కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఆజాదీ అమృత్ మహోత్సవ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైంది. రాష్ట్రం నుంచి ఇద్దరు అర్హత సాధించగా వీరిలో రాహిణి ఒకరు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులపై అవగాహన కల్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వీర్‌గాధ్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్రం నుంచి మొత్తం 98 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేయించుకున్నారు. రాహిణి మరాఠా యోధుడు నానా సాహెబ్ జీవిత చరిత్రపై పద్యం రాసి అందరి మన్ననలను అందుకుంది. టీచర్ బడేటి లక్ష్మి ఆమెకు తోడ్పాటు అందించారు. రూ.10 వేలు పారితోషికంతో పాటు ఈనెల 26వ తేదీన ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలలో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. చిన్ననాటినుంచే రాహిణి దేశనాయకుల చరిత్ర తెలుసుకునేందుకు ఆసక్తి కనపర్చేదని తండ్రి సత్యసారధి తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలన్నా రాహిణికి చాలా ఇష్టమని అలాగే బాస్కెట్‌బాల్, కూచిపూడిలో శిక్షణ తీసుకుంటోందన్నారు





సైంటిస్టు అవ్వాలన్నది నా లక్ష్యం : రాహిణి

నేను పుట్టిన దేశానికి ఉపయోగపడాలి. అందుకే నేను సైంటిస్టు అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దీనికి సంబంధించి ఇప్పటికే తెనులుకునే ప్రయత్నం చేస్తున్నాను. కష్టపడి చదువుతున్నాను.నాకు ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే నాకు చదువు చెప్పే ఉపాధ్యాయులు, పేరెంట్స్‌ని అడిగి తెలుసుకుంటాను.

ఏపీ శకటం ముందు నృత్యం..



కసిరెడ్డి దివ్య

పెంటపాడు గ్రామానికి చెందిన కసిరెడ్డి దివ్యకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు సంబంధించి ఏటి కొప్పాక బొమ్మల ఏపీ శకటాన్ని ప్రదర్శించనున్నారు. ఈ శకటం ముందు నృత్యం చేసే అవకాశాన్ని అంబాజీపేట మండలం ముక్కాములకు చెందిన పసుపులేటి నాగబాబు బృందానికి లభించింది. ఈ బృందంలో రాష్ట్రం నుంచి మొత్తం 16 మంది కళాకారులు ఉండగా వీరిలో దివ్య కూడా ఒకరు. పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న దివ్య ప్రస్తుతం పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. తల్లిదండ్రులు విజయభాస్కర్, పూర్ణిమ. పోస్టుబేసిక్ పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, వైస్ చైర్మన్ వరలక్ష్మి, హెచ్ఎం రాజేష్ తదితరులు దివ్యను అభినందించారు..

పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

కొనేవారే కరువు



పతనం అవుతున్న మిర్చి ధర

క్వింటా రూ.10 నుంచి 12 వేలు

కుక్కునూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మిర్చిసాగు చేస్తున్న రైతులకు కన్నీటి వెతలు తప్పటం లేదు. వరుసగా మూడో ఏడాది కూడా పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరానికి రూ.50 వేల నుంచి లక్ష వరకు నష్టపోయే పరిస్థితులు ప్రస్తుతం ఏర్పడ్డాయి. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఘననీయంగా తగ్గిన మిర్చిసాగు రాబోయే రోజుల్లో సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ళుగా తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి తగ్గడంతో రైతాంగం నష్టపోయారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో ధరలేక రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.10 వేల నుంచి 12 వేలు పలుకుతుంది. అయినప్పటికి రైతులు కళ్లాల దగ్గరకు వచ్చి కొనుగోలు చేయడానికి మాత్రం వ్యాపారులు రావడం లేదు. దీంతో రైతులు కళ్లాల్లోనే మిర్చి నిల్వ చేస్తున్నారు. క్వింటా మిర్చిని కొయ్యడానికి రైతులకు రూ.5 నుంచి 6 వేలు ఖర్చవుతుంది. ప్రస్తుతం ఉన్న ధర చూస్తే రూ. 10 నుంచి 12 వేలు ఉంది. సగం డబ్బులు మిర్చి కొయ్యడానికే ఖర్చవుతుండగా కౌలు ధరలు, పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో పెట్టుబడి పెరిగింది. ఇవన్నీ లెక్కగడితే రైతులు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రైతాంగానికి వ్యాపారులెవరూ పెట్టుబడులు పెట్టడం లేదు. దీంతో రైతులు బయట అప్పులు తెచ్చి మిర్చి సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు వేల ఎకరాల్లో మిర్చి పంటను పండించారు. ఈ ఏడాది కేవలం ఆరు వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఇక ముందు మిర్చి పంట కనుమరుగవు తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది వందలాది మంది రైతులు ధర పెరుగుతుందని ఆశాభావంతో గుంటూరు ఏసీ గొడౌన్స్‌లో మిర్చి నిల్వ చేశారు. అయినప్పటికి ధరలు పెరగకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

మూడేళ్లుగా కష్టాలే..



మూడేళ్ళుగా మిర్చి సాగుతో కష్టాలు, అప్పులే మిగిలాయి. ఆశించిన దిగుబడి రావడంలేదు. ధర ఉండటంలేదు. దీంతో మిర్చి రైతాంగానికి అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

- అంగిరేకులు సూరిబాబు, రైతు, కుక్కునూరు,



చిత్రలేఖనం, డ్యాన్స్ పోటీల్లో బంగారు పతకాలు

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన చిత్రలేఖనం, డాన్స్ పోటీల్లో అప్పనవీడు హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లుగా హెచ్.ఎం. పుష్పవతి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాహిత్యం, సాంస్కృతిక, కళా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కళల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో మెరుగైన అవకాశాలుంటాయని చిత్రలేఖనం ఉపాధ్యాయుడు రజనీకాంత్ తెలిపారు. ఉపాధ్యాయులు అమరావతి, సారధి, బాబి, జయలక్ష్మి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన అపుస్మా క్రీడాపోటీలు

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఏలూరు జోన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరుగుతున్న గేమ్స్, స్పోర్ట్‌మీట్ గురువారం ముగిశాయి. జోన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అపుస్మా రాష్ట్ర జనరల్ కార్యదర్శి ఎం.బి.ఎస్ శర్మ, రీజనల్ అధ్యక్షుడు జి.బుల్లబ్బాయ్ తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఈనెల 29న జరిగే వేడుకల్లో బహుమతులు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏలూరుజోన్ పీఎస్టీలు కె.వి.ఆర్ సతీష్, కె.శేఖర్, కడియాల విజయలక్ష్మి, కె.చంద్రశేఖర్‌రావు, ఎస్.ఆర్.కె ప్రసాద్, కె.వినోద్, శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

26న బాస్కెట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈనెల 28 నుంచి 31వ తేదీవరకు అంతర్‌జిల్లాల అండర్ -23 పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఈనెల 26వ తేదీన ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికల హైస్కూల్లో మహిళాజట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు జనవరి 1వ తేదీ 2002 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.వివరాలకు 94411 71933 నెంబర్లలో సంప్రదించాలని కార్యదర్శి గవ్వా శ్రీను,ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.

వైభవంగా ఆదిలక్ష్మి, రాజ్య లక్ష్మి, పోలేరమ్మ జాతర

భీమవరం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లకు గురువారం వైభవంగా జాతర నిర్వహించారు. రజక యూత్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల నుంచి జాతర ప్రారంభమైంది. శక్తి వేషాలు, కోయ డ్యాన్స్‌లు, అఘోరాలు, ఆసాదుల నృత్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సాగింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో అమ్మవార్లకు ఊయ్యాల సేవ నిర్వహించారు. గునుపూడి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.మహిళలకు అమ్మవారి కుంకుమ పంపిణీ చేశారు.



జాతరలో వివిధ వేషధారణలు.. తిలకిస్తున్న ప్రజలు

రేపు కైకలూరులో కొల్లేరుపై సమావేశం

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరులో ఆక్రమణల చెరువుల ధ్వంసంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈనెల 25న మూడు గంటలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొల్లేరు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కొల్లేరు సంఘం నాయకుడు సైదు సత్యనారాయణ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 మండలాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాజా సుప్రీంతీర్పుతో మరింత ఆందోళన చెందుతున్నార్నారు. 25న జరిగే సమా వేశానికి ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్ యాదవ్, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, కొల్లేరు ప్రాంత ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని తెలిపారు.



అశ్వ వాహనంపై లలితా త్రిపురసుందరి గ్రామోత్సవం

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చల్లనితల్లి... సర్వదాకాపాడు అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రులో ఉన్న శ్రీలలితా త్రిపురసుందరీదేవి ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రేపాక దుర్గాప్రసాద్, కార్యదర్శి చెన్నా ప్రవీణ్‌కుమార్, శివరామ్‌ప్రసాద్, ఎం.నాగరాజు పర్యవేక్షించారు.

ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు

ద్వారకాతిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్న ద్వారకాతిరుమల మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన ఒబిలిశెట్టి గోపాల కృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు-2025 లభించింది. ఈ అవార్డును ఆయన బెంగళూరులో అంతర్జాతీయ యోగ్యతా కేంద్ర ప్రతినిధుల నుంచి బుధవారం సాయంత్రం అందుకున్నారు. గుండుగొలనుకుంటలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణా కేంద్రంలో ఆయన కషాయాలు వంటివి తయారు చేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు ఆయనను అభినందించారు.



బెంగళూరులో ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న గోపాలకృష్ణమూర్తి



లోకేశ్ ఫేస్ మాస్క్‌లతో విద్యార్థినుల శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల గురుకుల పాఠశాల విద్యార్థినులు మంత్రి నారా లోకేశ్ ఫేస్ మాస్క్‌లను ధరించి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. దాదాపు 700 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్కులు ధరించిన విద్యార్థినులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సెల్ఫీ దిగారు.

- ద్వారకాతిరుమల

నిధులు బొక్కేసినా.. చర్యలేవీ!

- చినఅమిరం, రాయలం పంచాయతీల్లో రూ.5కోట్ల దుర్వినియోగం
- అధికారుల విచారణలో వెల్లడైన వాస్తవాలు
- చర్యలు తీసుకోవడంలో పంచాయతీరాజ్ శాఖ జాప్యం



భీమవరం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చేయడానికి నిధుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో గ్రామాల నిధులనే కార్యదర్శి స్వాహా చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. భీమవరం రూరల్ మండలం చినఅమిరం, రాయలం గ్రామ పంచాయతీలో కార్యదర్శి రూ. 5 కోట్ల నిధులు స్వాహా చేసినట్టు విచారణలో నిగ్గు తేలింది. వైసీపీ హయాంలో కార్యదర్శిగా పనిచే సిన కృష్ణంరాజు(కిశోర్ రాజు) నిధులు స్వాహా చేసినట్టు అధికారులు గర్తించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఏడుగురు కార్యదర్శుల బృందం, జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. గడిచిన నాలుగేళ్ళలో ఇంత మొత్తంలో నిధులు దుర్వినియోగమవుతుంటే దానిపై దృష్టి పెట్టకపోవడం పెద్ద మిస్టరీగా మారింది. పాలకవర్గాలు లేకపోవడంతో కార్యదర్శి దందా సునాయాసమైంది. అప్పటి స్థానిక ఎమ్మెల్యేతో పాటు రాయలసీమకు చెందిన వైసీపీ మంత్రి అండదండలు ఉన్నాయన్న ఉద్దేశంతో కార్యదర్శి చెలరేగిపోయారు. ఆస్తిపన్నును దారిమళ్లించారు. భీమవరం పట్టణంలో విలీన గ్రామాల్లో ఈ రెండు గ్రామాలు ఉండిపోవడం వల్ల పంచాయతీ పాలకవర్గాలు లేకుండాపోయాయి. దీంతో గడిచిన ఐదేళ్ళ నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే రెండు గ్రామాలు మగ్గుతున్నాయి. ప్రత్యేకాధికారులుగా ఎంపీడీవోలు, ఇతర అధికారులు వ్యవహరించారు. అయినప్పటికీ నిధులు దుర్వినియోగం కావడంపై విస్మయం వ్యక్తమవుతోంది. రాయలం గ్రామంలో అధికారుల పరిశీలన నివేదికలో రూ. 2 కోట్ల 33 లక్షలు, చినఅమిరంలో రూ. 2. కోట్ల 73 లక్షలు నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. రాయలం గ్రామం నిధుల దుర్వినియోగం నిర్ధారణ సమయంలోనే కార్యదర్శి కృష్ణంరాజును అరెస్ట్ చెయ్యాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇప్పుడు మళ్ళీ చినఅమిరం పంచాయతీ నిధులు దుర్వినియోగంలో కూడా కలెక్టర్ నుంచి అరెస్ట్‌పై ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలోనే దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. పంచాయతీరాజ్ శాఖకు లేఖ రాశారు. కృష్ణంరాజు(కిశోర్‌రాజు)పై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు పంచాయతీ రాజ్ శాఖనుంచి ఎటువంటి స్పందన లేదు. మరోవైపు కార్యదర్శి కృష్ణంరాజు కూడా జిల్లా అధికారుల వద్ద ధీమాను ప్రదర్శిస్తున్నట్టు అంతా కోడై కూస్తున్నారు. దానివల్లే ఇప్పుడు ఆయనపై చర్యలు తీసుకోవడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చర్యలు తీసుకోవడంలోనూ, రికవరీలోనూ జాప్యం జరిగితే పంచాయతీరాజ్ శాఖలో నిధులు దుర్వినియోగానికి ఊతమిచ్చినట్టు అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో ఆచంటలో డయాలసిస్ కేంద్రం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



ఆచంట వేమవరంలో హాస్టల్స్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పితాని

ఆచంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచంటలో త్వరలో రూ. కోటి రూపాయల వ్యయంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. గురువారం ఆచంట వేమవరంలో రూ. 3 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పితాని కలిసి ప్రారంభించారు. కేంద్రమంత్రి విలేకరులతో మట్లాడుతూ ఆరు నెలల వ్యవధిలో కేంద్రం రాష్ట్రానికి 3 లక్షల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఆర్డీవో దాసిరాజు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

బరి తెగించి డబ్బు పంపకాలు



కోడి పందేల్లో లక్షలు దాటిన ముడుపులు.. సెల్యూట్ బాస్‌లకు ఆనందమయ 'సంక్రాంతి'

భీమవరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, జూదాలకు అనుమతులు ఇస్తారా లేదా అని ఆతృతగా ఎదురు చూసేవారు. కనీసం పండుగ రెండు రోజులైనా అనుమతులు ఇస్తే సరిపోతుందిలే అనుకునేవారు. అలా పండుగ రోజు వరకు వేచి చూసి పందేలకు తెరలేపేవారు. ఐదేళ్ల ఉన్న వైసీపీ ప్రభుత్వంలో కూడా పందేలు అలానే సాగాయి. కానీ సీన్ రివర్స్ అయ్యింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సంక్రాంతి పండుగకు కోడిపందేలు, జూదాలకు హద్దే లేకుండాపోయింది. ఇంకా పండుగ వారం రోజులు ముందుగానే బరుల కోసం స్థలాల కేటాయింపులు భారీగా సెట్టింగులతో చాలా ప్రాంతాల్లో వెలిశాయి. గతంలో సంక్రాంతి ముందు రోజు వరకు కూడా పోలీసులు బరులను ట్రాక్టర్‌లు, ప్రొక్లెయిన్‌లతో ధ్వంసం చేసేవారు. ఈ ఏడాది చాలాచోట్ల పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దానికి తోడు లక్షల్లో ముడుపులు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అధికారులకు అందాయన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతున్నది. గతంలో బెదిరిస్తే ఎంతో కొంత డబ్బులు ఇచ్చేవారు. ఈ ఏడాది అటువంటిది ఏమీ లేకుండానే కట్టలు వచ్చిపడ్డాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో బరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు కొంతమంది పోలీసులకు అందాయని చెబుతున్నారు. జిల్లాలోని ఒక స్టేషన్ పరిధిలో క్యాసినో వంటి జూదం నిర్వహించినందుకు ఆ స్టేషన్ అధికారికి రూ.8 లక్షల వరకు ముట్టచెప్పారని, కొన్ని స్టేషన్‌లకు 2 నుంచి 5 లక్షల వరకు అందాయని చెప్పుకుంటున్నారు. ఒక స్టేషన్ పరిధిలో సిబ్బందికి రూ.20 వేల నుంచి 25 వేలు వరకు ముడుపులు అందాయన్న ప్రచారం జరుగుతున్నది. డబ్బులు సరిగా అందని అధికారులు ఒత్తిడి తెస్తే అవతలి వారు ప్రజాప్రతినిధులకు, నాయకులకు విషయాన్ని చెప్పి నీసంగతి చూస్తామంటూ చెప్పడంతో వారు వెనుతిరిగారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది కోడిపందేల బరులు పందెంరాయుళ్ళకు ఆదాయం ఎలా ఉన్నా సంబంధిత అధికారులకు భారీగా జేబులు నిండాయన్న ప్రచారం జరుగుతున్నది.

పోలీసులకు సంబంధం లేదు

డీఎస్పీ జయసూర్య

ఇటీవల సంక్రాంతి నేపథ్యంలో కొన్ని చోట్ల జరిగిన కోడి పందేలు, జూదాల విషయంలో పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని భీమవరం డీఎస్పీ జయసూర్య వెల్లడించారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కొన్నిచోట్ల పోలీసులకు ముడుపులు అందాయని జరుగుతున్న ప్రచారం అవాస్తమని అన్నారు. పందేలు, జూదాలు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరిగాయన్న విషయం అందరికీ తెలిసిదేనని ఆయన అన్నారు. పోలీసులు ఎక్కడైనా ముడుపులు తీసుకున్నారన్న విషయాలు రుజువైతే ఖచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి





మృతి చెందిన క్రాంతికుమార్

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం కడిమికుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతికుమార్ (19) కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లోని అయోధ్య లాడ్జి సమీపంలో జాతీయరహదారిపై లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి బాబురావు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోటారుసైకిల్‌పై స్నేహితుడు సుధీర్‌తో కలిసి సెల్‌ఫోను మరమ్మతు నిమిత్తం హనుమాన్‌జంక్షన్ వచ్చారు. అనం తరం సెల్‌ఫోన్ షాపు నుంచి మోటారు సైకిల్‌పై తిరిగి వెళుతుండగా విజయవాడ నుంచి జంక్షన్ వైపు వెళుతున్న ఆర్‌జే 11 జీబీ 7744 నెంబరు గల లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో క్రాంతి కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

జంగారెడ్డిగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం ఫిబ్రవరిలో విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. ఆ కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం డీవైఈవో మడకం రామన్నదొర గురువారం విద్యార్థులను విచారించారు. విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆయన తెలిపారు

బెండ్లపాలెం వాసులకు ఊరట

కాల్వపై బల్లకట్టు ఏర్పాటు .. ఎమ్మెల్యే బొలిశెట్టికి కాలనీ వాసుల కృతజ్ఞతలు



నూతనంగా తయారు చేయించిన బల్లకట్టుపై ఎమ్మెల్యే బొలిశెట్టి, తదితరులు

పెంటపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రావిపాడు సమీపంలో ఉన్న బెండ్లపాలెం వాసులకు ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఇళ్లులేని వారికి ఇక్కడే కేటాయించారు. వారికి కనీసం కాలనీలోకి వెళ్ళేందుకు సరైన మార్గం కూడా ఏర్పాటు చేయలేదు. అక్కడితో తమ పని అయిపోయిందంటూ చేతులు దులిపేసుకున్నారు. స్థలాలు రావంతో చాలా మంది ఇళ్లు కట్టుకున్నారు వీరికి గ్రామంలోకి వెళ్ళేందుకు సరైన మార్గం ఉండేది కాదు. జాతీయ రహదారి నుంచి చుట్టుతిరిగి వెళ్ళాల్సి ఉంటుంది. ఎందుకంటే బెండ్లపాలెం నుంచి రావిపాడు గ్రామాల మధ్య వెంకయ్య ఒయ్యేరు కాలువ ఉంది. ఈ కాలువపై వంతెన లేదు. దీంతో ఆ కాలనీ వాసులు ఇప్పటి వరకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఎన్నికల సమయంలో ప్రచార కార్యక్రమంలో వీరి కష్టం చూసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వంతెన ఏర్పాటు చేసేంత వరకు తాత్కాలికంగా బల్లకట్టు ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులు రూ.12 లక్షలతో బల్లకట్టు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్ర- తెలంగాణ మధ్య నిలిచిన ట్రాఫిక్



జీలుగుమిల్లి- అశ్వారావుపేట మధ్య గురువారం నిలిచిన ట్రాఫిక్

జీలుగుమిల్లి, జనవరి 23 : (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి- అశ్వారావుపేట గ్రామ సరిహద్దు వరకు జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. గురువారం సాయంత్రం నుంచి తాటియాకులగూడెం వద్ద జాతీయ రహదారిపై గోతుల్లో లారీ పాడై నిలిచిపోయింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. సాయంత్రం 5 గంటల నుంచి 8గంటల వరకు వాహన చోదకులు మూడుకిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. జీలుగుమిల్లి ఎస్సై వి.నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ సిబ్బంది కలసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారు.

'గాంధేయం' కవితా రచనల పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాస్థాయిలో 'గాంధేయం' అంశంపై జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా రచనల పోటీ విజేతల జాబితాను సర్వోదయమండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం పత్రికలకు విడుదల చేశారు. ఉత్తమమైన 20 రచనలను ఎంపిక చేశామని, విజేతలకు ఈ నెల 30న బహుమతులు, కవితా పురస్కారాలు అందజేస్తామని వివరించారు. విజేతల వివ రాలు ఇలా...కలిగొట్ల గోపాలశర్మ, భీమవరం. తెన్నేటి మాస్టారు, పాలకోడేరు. వేమూరి శ్రీనివాస్, టి.పి.గూడెం. మీసాల సూర్యనారాయణ, పెద అమిరం. దేవరకొండ బాలసుబ్రహ్మణ్యం, ఉండి. కాళ్ళకూరి సుబ్రహ్మణ్యశర్మ, గునుపూడి. యండవల్లి పాండురంగాచార్యులు, గణపవరం. శశికళ, అజ్జమూరు. గుండాల గీతా మహాలక్ష్మి, వబలపర్రు, చివటం సుబ్బారావు, పెనుగొండ. కొల్లాబత్తుల సూర్యకుమార్, పాలకొల్లు. ఏ.వి.వి. మురళీధర్, ఏలూరు, పంపన సాయిబాబు, వీరవాసరం. దొంతాభక్తుని రామ నాగేశ్వరరావు, జి.హనీ, భీమవరం. హైమావ తీసత్య, వేల్పూరు. సాతివల్లి వెంకటేశ్వరరావు, తణుకు. చింతా రాంబాబు, కాట్రేనికోన. ఉజ్జిన కనకదుర్గ, టి.పి.గూడెం. చర్ల మృదులకుమారి, మల్లవరం.

సమస్యలు పరిష్కరించాలని టిప్పర్, లారీ వర్కర్స్ ఆందోళన



భీమవరం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించిందని, అయితే ఇసుక విక్రయించే ప్రాంతంలో స్థానిక టిప్పర్లకు ఒక రేటు, స్థానికేతర టిప్పర్లకు మరో రేటుతో వ్యత్యాసం చూపిస్తున్నారని దానివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని టిప్పర్,లారీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రావూరి రాజా ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా టిప్పర్ లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని గురువారం సాయంత్రం నిరశన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు కూడా అక్కడి నాయకులతో కు మ్మక్కై తమను ఇబ్బందులు పాలు చేస్తు న్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు తెలపటం కోసం ఈ నిరసన కార్యక్రమం చేప ట్టామని అన్నారు. భీమవరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు అడబాల శ్రీనివాస్, అధ్యక్షుడు శిరిగినీడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విర్డ్ ఆసుపత్రిలో హ్యాండ్‌సర్జన్ సేవలు

ద్వారకాతిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈనెల 24, 25 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డా. భాస్కర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్నిరకాల చేతి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో నిర్దేశించిన వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. అవసరమైన వారు ముందుగా 8374445108, 7901695176 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

నరసాపురం రూరల్,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో గురువారం దమ్ముట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ పోతుమూడి వెంకటేశ్వరావు (51) మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం పాలకొల్లు మండలం వెలివెలి. భార్యఇద్దరు పిల్లలు ఉన్నారు. చేనులో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడటంతో సంఘటనా స్థలంలోనే వెంకటేశ్వరావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట సురేశ్ చెప్పారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు వాహనాల్లో కుళ్లిన చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, వీరమ్మకుంట, తోటగూడెం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి చికెన్ వ్యర్థాలతో కూడిన మూడు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీశ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు వాహనాల్లోని సుమారు 30 వేల కిలోల చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా ఎస్సై చెప్పారు. వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఎదుట యువకుడి ఆత్మహత్యా యత్నం

భీమవరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం రెండవ పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఒక మోటార్ సైకిల్ ఫైనాన్స్ కంపెనీ ముందు ఒక వ్యక్తి పెట్రోల్ పోసుకుని బుధవారం సాయంత్రం ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన ఒక యువకుడు కొంత కాలం క్రితం అక్కడ బైక్‌ను ఫైనాన్స్‌లో తీసుకున్నాడు. దాని నిమిత్తం రూ. 18 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే వడ్డీల మీద వడ్డీలు పడటంతో సుమారు రూ. 60 వేలు వరకు చెల్లించినట్లుగా బాధితుడు వాపోయాడు. అయినా కూడా ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు ఇంకా సొమ్ములు చెల్లించాలని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అక్కడ ఉన్న స్థానికులు సముదాయించి అతనిని ఇంటికి చేర్చారు. అయితే దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) యశ్వంత్‌దీపు (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కలెక్టరేట్ ఆవరణలోని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వేమవరపు యశ్వంత్‌దీపు (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు ఇజ్రాయిల్‌పేటకు చెందిన యశ్వంత్ దీపు తండ్రి మరణంతో కారుణ్య నియామకంలో భాగంగా నాలుగు సంవత్సరాల క్రితం అతనికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. అతనికి వివాహం కాగా భార్యభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలతో విడిపోయారు. మళ్ళీ వేరే యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇంకా సంతానం కలుగలేదు. కొంతకాలం నుంచి అనారోగ్యానికి గురై మందులు వాడుతున్నాడు.

ఏలూరు పాత బస్టాండ్‌లో మృతదేహం

ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం తనకు అనారోగ్యంగా ఉందని పర్మిషన్ కావాలంటూ ఆశాఖ ఉద్యోగిని అడిగి ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని ఒక ఆసుపత్రికి వెళ్ళారు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరలేదు. గురువారం ఉదయానికి ఏలూరు పాతబస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని ముక్కు, నోటి వెంబడి రక్తం బాగా వచ్చి రక్తపు మడుగు ఉంది. అతని శరీరంపై ఎలాంటి దెబ్బలు కనిపించలేదు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఆత్మహత్య

లింగపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మాజీగూడెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన కొనకళ్ల శ్రీనివాసరావు(38) లింగపాలెం మండలం కొణిజర్లలోని సంక్రాంతి పండుగకు తన అత్తవారి ఇంటికి వచ్చాడు. ఈ నెల 21వ తేదీన భార్య లక్ష్మితో బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లి పురుగుమందు తాగి అపస్మారకస్థితికి చేరడంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. వెంటనే చింతలపూడిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు.

ట్రావెల్ బస్సు ఇంజన్‌లో మంటలు, పొగలు



బస్సు ఇంజన్ నుంచి వస్తున్న పొగలు

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు వెళ్తుండగా ఇంజన్ నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో రోడ్డుపై వెళ్ళేవారు గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. మార్నింగ్‌స్టార్ ప్రైవేటు ట్రావెల్ బస్సు రాజమండ్రి నుంచి బెంగళూరుకు స్లీపర్ కోచ్‌గా గురువారం రాత్రి వెళుతున్నది. మార్గమధ్యలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద కొంత మంది ప్రయాణికులు ఎక్కారు. మొత్తం పది మంది ప్రయాణికులు మాత్రమే ఆ బస్సులో ఉన్నారు. ఏలూరు ఊరులో నుంచి వెళ్తుండగా రాత్రి 7.55 గంటలకు పాతబస్టాండ్ సిగ్నల్ వద్ద ఆ బస్సు వెనుక ఉన్న ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. ద్విచక్ర వాహనదారులు గుర్తించి వెంటనే వాహనదారులు ఆ బస్సు ముందుకు వెళ్ళి బస్సును ఆపించారు. ఆ బస్సులో ఉన్న పది మంది ప్రయాణికులు వెంటనే కిందకు దిగారు. పొగలు, కొద్దిపాటి మంటలు ఇంజన్ నుంచి వస్తూనే ఉన్నాయి. ఫైర్ ఇంజన్ అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈ మంటలు, పొగలు వచ్చి ఉంటాయని గుర్తించారు. ఆ బస్సుకు అప్పటికప్పుడే తాత్కాలిక మరామత్తులు నిర్వహించి ఖాళీ బస్సును తీసుకువెళ్ళారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగపాలెం మండలం వెస్ట్‌ఎడవల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణ (45)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగా ఈనెల 22వ తేదీన పురుగుమందు తాగాడు. అతనిని తొలుత చింతలపూడి ఆసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురం స్పోర్ట్స్ క్లబ్‌లో పోలీసుల తనిఖీలు

నరసాపురం రూరల్, జనవరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ క్లబ్‌లో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్పోర్ట్స్ ముసుగులో క్లబ్‌లో పేకాట ఆడుతున్నారని, దీన్ని మూయించి వేయాలంటూ బుధవారం గ్రామస్థులు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఈ క్లబ్‌ను రూరల్ సీఐ ప్రసాద్, మొగల్తూరు ఎస్‌ఐ వాసు పరిశీలించారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో వారు పరిశీలించి వెళ్ళిపోయారు.


చాటపర్రులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద వృద్ధులకు పండ్లు పంపిణీ


చింతలపూడిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సొంగా


జంగారెడ్డిగూడెం టీడీపీ కార్యాలయంలో సంబరాలు

ఎన్టీఆర్ స్ఫూర్తితో లోకేశ్ కార్యాచరణ

యువనాయకుడిగా రాణిస్తున్నారన్న ఏలూరు జిల్లా టీడీపీ నాయకులు - పలు చోట్ల సేవా కార్యక్రమాల నిర్వహణ

ఏలూరు టూటౌన్/ ఏలూరు క్రైం/ దెందులూరు/ పోలవరం/ లింగపాలెం/ పెదపాడు/ టి.నరసాపురం/ కామవరపుకోట/ కుక్కునూరు/ చింతలపూడి/ఏలూరు రూరల్/పెదవేగి/ వేలేరుపాడు/ కొయ్యల గూడెం/ బుట్టాయ గూడెం/ జీలుగుమిల్లి/ జంగారెడ్డి గూడెం/ ద్వారకా తిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే పరమార్థంగా రాష్ట్రాన్ని పాలించిన ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని మంత్రి లోకేశ్ ముందుకు సాగిస్తు న్నారని ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్‌లు అన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారీకేకు కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హ్యాపీబర్త్‌డే లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్. పెదబాబు, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, చోడే వెంకటరత్నం, అమరావతి అశోక్, పెనుబోయిన మహేష్ కుమార్, ఎల్.శ్రీనివాస్, మారం హనుమంతరావు, పూజారి నిరంజన్, బొద్దాని శ్రీనివాస్ ఆర్‌అండ్ ఆర్ నాగే శ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు పాల్గొన్నారు.ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పండ్లు పంపిణీ చేశారు. దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన లోకేష్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, తోట యేసమ్మ, సంపంగి వేణు గోపాల తిలక్, ఎంపీటీసీ శేషారత్నం, కలపాల చంద్రశేఖర్ పాల్గొన్నారు. పోలవరం మండలంలో టీడీపీ నాయకులు కొవ్వాసు జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు నరేష్ చౌదరి, సుధీర్ బాబు, బొరగం బుజ్జిదొర, ముచ్చిక యోగిదొర, మణికంఠ, ఎస్సీ విభాగం నాయకులు పి.నాగరాజు, మణికంఠ పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో మంత్రి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించగా మోరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జయ్య, మోరంపూడి ప్రసాద్, ముసునూరి రాము,పాతూరి శ్రీనివాసరావు, యలమంచి శ్రీనివాసరావు, బొల్లినేని శ్రీనివాసరావు, కూరపాటి వెంకటేశ్వరరావు, తాతిన రాధాకృష్ణ జి సాయి, చెన్ను శ్రీనివాసరావు, అజయ్, గిరిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో మండలాధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉప్పలపాటి రాంప్రసాద్, గారపాటి రామసీత, వడ్డి వాసవి, అక్కినేని వంశీ కృష్ణ, కొత్తూరు చినబాబు, శ్రీశైలం, వీరాంజనేయులు పాల్గొన్నారు.టి.నరసాపురం మండలంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు టీడీపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణా రావు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కామవరపుకోటలోని చౌదనా సెంటర్‌లో టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుక్కునూరులో పార్టీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ లోకేశ్ పేరు మీద పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజారెడ్డి, చిట్లూరి ధర్మరాజు, టి.అప్పారావు, కొత్తపూడి శేషగిరిరావు, డి.మోహన్ రావు, తోట నారాయణ, చీదరాల మధుబాబు పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు నంబూరి నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు నేతల రవి, నాయకులు పైడిపాటి శేఖర్, కాలారి శ్రీనాథ్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. పెదవేగి మండలంలోని కొల్లేరులంక గ్రామంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించగా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలేరు పాడులోని పార్టీ కార్యాలయంలో అశోక్, కొమ్మన వెంకటేశ్వరరావు, సంజీవులు, సుధాకర్, శ్రీరాములు, రాధాకృష్ణ లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఎంపీ కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపీ కార్యాలయంలో కేకును కట్ చేసి లోకేశ్‌కు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. కొయ్యల గూడెంలోని ప్రధాన సెంటర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించగా టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బుట్టాయ గూడెం క్యాంపు కార్యాలయంలో నిర్వ హించిన వేడుకల్లో నాయకులు మొగపర్తి సోంబాబు, మడకం కన్నపరాజు, జారం చాందినీ విద్యాసాగరిక, ఎం.రామకృష్ణ, టి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు. టీడీపీ జీలుగుమిల్లి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి నాయకులు టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి తూటిగుంట రాము,నాయకులు నంబూరి రామచంద్రరాజు, పరిమి సత్తిపండు,అబ్బిన దత్తాత్రేయ పాల్గొన్నారు. శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో వినూత్నంగా నిర్వహించారు. ద్వారకాతిరుమలలోని వి.కన్వెన్షన్ కల్యాణమండపంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.


కామవరపు కోటలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



బోర్డు వద్దే వేసిన చెత్త

బోర్డులున్నా... ప్రయోజనం సున్నా..

చింతలపూడి, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : చెత్త వేస్తే వెయ్యి రూపాయల జరిమానా అంటూ మునిసిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా ప్రజలు లెక్కచేయడం లేదు. స్థానిక బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బోర్డు వద్దే చెత్తను వేయడంతో చూసిన వారంతా అవాక్కవుతున్నారు. దీనిని బట్టి హెచ్చరిక బోర్డులు పెట్టినా ఫలితం లేదనే టాక్ వినిపిస్తోంది. ఇదీ చింతలపూడి పెట్రోలు బంకుల సమీపంలో బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పరిస్థితి. వ్యర్థాలకు తోడు పందులు చేరడంతో దుర్వాసన, దోమల బెడద మరింత పెరిగింది. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ప్రారంభం నుంచి చివరి వరకు చెత్తడంపింగ్ చేయడంతో వాహనదారులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతలపూడిలోని ప్రజలు, వ్యాపారులు వ్యర్థాలన్నీ తీసుకెళ్ళి అక్కడే వేస్తున్నారు. అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరించడంతో రోడ్డుకిరువైపులా వ్యర్థాలు మరింత పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే మరింత అధ్వానంగా మారే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు.

కొండపై ఇనుప ముక్కల చోరీ

ద్వారకా తిరుమల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శేషాచల కొండపై అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతంలో ఇనుప ముక్కలను తస్కరించి పాత ఇనుప సామాన్ల దుకాణంలో విక్రయిస్తున్న బాలుడ్ని సెక్యూరిటీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇనుప ముక్కలను గోనెలో వేసుకుని తీసుకెళ్తున్న ఆ బాలుడ్ని స్థానిక టోల్‌గేట్ వద్ద ఆలయ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం పోలీస్టేషన్‌లో అప్పగించారు. ఈ బాలుడిది కామవరపు కోట మండలం ఈస్టు ఎడవల్లిగా పోలీసులు చెబుతున్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ల కోసం యూటీఎఫ్ వినతి

ఏలూరు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : గత ఏప్రిల్ నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని అభ్యర్థిస్తూ గురువారం ఏలూరు తహసీల్దార్‌కు యూటీఎఫ్ నగర శాఖ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.ఇప్పటికే డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేశామని, ఇంకా ఎవరికైనా ఇవ్వాల్సి ఉంటే, వారి వివరాలను అందజేయాలని తహసీల్దార్ సూచించిన నేపథ్యంలో అక్కడికక్కడే వివరాలను సమర్పించామని యూటీఎఫ్ నాయకులు శివశంకరరావు, షేక్‌పర్వీన్, రాజారావు, తదితరులు తెలిపారు.

'సమస్యలుంటే తెలపండి'

భీమడోలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశానికి పల్లెలే పట్టుకొమ్మలుగా తీర్చిదిద్దాలని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ సూచించారు. భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు దత్తత తీసుకున్న ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలపై దృష్టి సారిస్తానని ఏ ఇబ్బంది ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు స్టేషన్ పరిధిలోని 33 కేవీ భీమడోలు నుంచి ఆగడాలలంక పరిధిలో చెట్టు తొలగించే సందర్భంగా శుక్రవారం ఈ ప్రాంతంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ లక్ష్మీపురం, ఆగడాలలకం, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు హేలాపురి బాలోత్సవం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ విద్యాలయంలో ఈ నెల 24, 25 తేదీల్లో హేలాపురి బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి నాగేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలోత్సవ ఏర్పాట్లపై గురువారం సిద్ధార్థ క్వెస్ట్ ప్రాంగణంలో సమీక్షా సమావేశాన్ని జరిపారు. ఏ విధంగా నిర్వహించాలన్నదానిపై చర్చించి తీర్మానం చేశారు. గురువారం క్వాయిన్స్, ఫ్యాన్సీ నోట్స్ ఎగ్జిబిషన్‌ను మోటివేషన్ చార్ట్ ఎగ్జిబిషన్‌ను మండల విద్యాశాఖాధికారి సబ్బితి నరసింహమూర్తి ప్రారంభించారు.

జాబ్ మేళాకు 350 మంది అభ్యర్థులు హాజరు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 350 మందికిపైగా అభ్యర్థులు పాల్గొన్నారని జిల్లా కో-ఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కృష్ణ తెలిపారు. ఈ మేళాలో ప్రధాన ఆకర్షణగా దక్షిణ ఆసియాలో అతిపెద్ద చాక్లెట్ ప్లాంట్ అయిన క్యాడ్బరి మోండలైజ్ ఇంటర్నేషన్(శ్రీ సిటీ) కోసం నియామక ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఈ కంపెనీలో ఉద్యోగాల కోసం 260 మంది దరఖాస్తు చేసుకోగా 17 మందిని ఎన్నుకున్నట్టు తెలిపారు.

'వెల్‌నెస్ క్లినిక్‌ను వినియోగించుకోండి'

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించిన వెల్‌నెల్ క్లినిక్ ప్రతి సోమ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలిపారు. ఈ క్లినిక్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆరోగ్య విద్యా బోధకులు, ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వీరు జీవన శైలికి సంబంధించిన వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు.

'బాధిత కుటుంబాన్ని టీడీపీ ఆదుకుంటుంది'

పెదవేగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతి చెందిన పెదవేగి మండలం ముండూరుకు చెందిన బుడపన శ్రీనివాసరావు(40) మృతదేహానికి ఏలూరులోని సర్వజన ఆస్పత్రిలో గురువారం శవపరీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి ఆసరాగా నిలుస్తామని చెప్పారు.

'ముంపు గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకోవాలి'

వేలేరుపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు మండలంలో ప్రాజెక్టు నిర్మాణంతో మునిగిపోతున్న గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలను కూడా ఒక యూనిట్‌గా తీసుకుని మండలంలో అన్ని గ్రామాల ప్రజలకు పోలవరం పరిహారం చెల్లించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ఎస్.కే.గౌస్ అన్నారు. ప్రస్తుతం 41.15 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్ఆర్ పరిహారం చెల్లిస్తున్నారని 45.72 కాంటూరులో ఉన్న నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, ముత్యాలరావు, వీరాస్వామి, రాంబాబు, సత్యవతి, చోడే విజయ, రత్తమ్మ పాల్గొన్నారు.

బాలికా దినోత్సవ ప్రచార పత్రిక ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలికలహక్కులు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. ఈ నెల 24న జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోచైల్డ్ గ్రూప్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫోరంఫర్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో ముద్రించిన గోడపత్రికను గురువారం జేసి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని వారి బంగారు భవిష్యత్‌కోసం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేతల రమేష్‌బాబు, జి.శివకృష్ణ, క్రాప్ కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు పాల్గొన్నారు.

'విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

పెదవేగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమస్యల్లో చిక్కుకునే అవకాశమే ఉండదని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. అభయ రక్షక దళం ఆధ్వర్యంలో మండలంలో వంగూరు, జగన్నాథపురం, పెదవేగి, కూచింపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిస్తూ ప్రతి ఒక్కరిలో చేతన్యం తీసుకొస్తున్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

పోలవరం ప్రాజెక్టు వద్ద లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు

పోలవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర భారీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టుని పరిశీలించారు. ఉదయం పోలవరం ప్రాజెక్టుకి చేరుకున్న మంత్రికి ఇంజనీరింగ్ అధికారులు పుష్ప గుచ్ఛాలతో స్వా గతం పలికారు.తొలుత స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మంత్రి లోకేష్ బాబు జన్మదినం సందర్భంగా ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. అనంతరం ప్రాజెక్టు కార్యా లయంలో ఇంజనీరింగు అసోసియేషన్ ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోలు ఎస్ఇ డి.త్రిమూర్తులు, నూతన ఎస్ఈ రామచంద్రరావు మంత్రికి శాలువా కప్పి సన్మానం నిర్వహించారు. ఈ సమావేశంలో క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ డి.తిరుమలరావు, ఇఇ వెంకటేశ్వర రావు, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఎడమ ప్రధాన కాలువ ఎస్ఇ యేసుబాబు, ఐటిడిఏ పిఓ రాములు నాయక్, పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మంత్రి నిమ్మల

కొల్లేరు ప్రజల వలసలకు ప్రభుత్వమే కారణం : సీపీఎం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : కొల్లేరును ఐదవ కాంటూరు నుంచి మూడవ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల మాటలు కొల్లేరేనా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం వ్యాఖ్యానించారు. గురువారం స్థానిక సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని ఉద్దరాజు రామం భవనంలో నిర్వహించగా కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొల్లేరు సమస్యలపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ వేలాది ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని అన్నారు. దీంతో వేలాది మంది ప్రజలు పొట్ట చేతపట్టుకుని వలసలు వెళ్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేశారన్నారు.కాని పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత నుంచి పూర్తిగా వైదొలిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్,ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, బి.రాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన


బోస్ విగ్రహానికి పూల మాల వేసిన ఎమ్మెల్యే చంటి


తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో నివాళులు

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

ఏలూరు టూటౌన్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ధీరోదాత్తమైన పోరాటంతో దేశప్రజల గుండెల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్ఆర్.పేటలో నేతాజీ సుభాష్ చంద్రబో స్ విగ్రహం వద్ద 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో నేతాజీ చూపిన పోరాట ప్రతిమ ఎంతో ఆదర్శనీయమన్నారు. ప్రజల్లో ధైర్యసాహసాలు నింపి వారందర్ని పోరాట మార్గం వైపు పయనింప చేసిన ఘనత నేతాజీకే దక్కుతుందన్నారు. ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎం.నాగరాజు, శ్రీనివాస్, ఏవీ పవన్‌కుమార్, పూర్ణచంద్రరావు, బాలాజీ, బొద్దాని శ్రీనివాస్, తిరుపతి, రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాల పంపిణీ

ఏలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీనియర్స్ సిటీజన్స్ భవనంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకం ప్రచారకర్త ఎస్.కె సుభానీ ప్రతి ఏడాది రిపబ్లిక్‌డే, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని 5వేలమందికి జాతీయ పతాకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ పతాకాలను సీనియర్ సిటీజన్స్‌కు వివిధ సంస్థల ప్రతినిధులకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ఇచ్చి గౌరవించాలన్నారు. ప్రతి పాఠశాల ప్రభుత్వ కార్యాలయాల్లో పింగళి చిత్రపటాలను ఏర్పాటుచేసి ఘనంగా నివాళులర్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే నేటితరానికి దేశంపై భక్తిభావం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్వరపీఠం సభ్యులు అర్జున్, సీనియర్ సిటీజన్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడిలోని పోలీస్ స్టేషన్ వద్ద...

కామవరపుకోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధులు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా తడికలపూడిలోని పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు గురువారం కార్యక్రమం నిర్వహించారు. నేతాజి సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

జంగారెడ్డిగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బోసు బొమ్మ సెంటర్‌లో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నిడమర్రు గ్రంథాలయ భవనంలో

నిడమర్రు జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర పోరాటంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ యువతలో ఎంతో స్ఫూర్తిని నింపి పోరాటం సాగించారని నంద్యాల రామలింగరాజు అన్నారు. గురువారం నిడమర్రు గ్రంథాలయ భవనంలో నేతాజి జయంతి వేడుకలు ఘనంగా నివాళులర్పించారు.

ఉద్యోగాలకు ఎన్ఆర్ఐ విద్యార్థుల ఎంపిక

ఏలూరు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : చెన్నైకి చెందిన ఫాక్సాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బహుళ జాతి సంస్థ గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎన్ఆర్ఐ డిగ్రీ కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు కళాశాలల సీఈవో వి.తులసీరామ్ ఓ ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. తమ కళాశాల అనుసరించిన పటిష్ఠ ప్రణాళికను బట్టే 63 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులకు రూ.2.5 లక్షల వార్షిక ప్యాకేజితో పాటు, పీఎఫ్, భోజన వసతి వంటి సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజశేఖర్ అభినందించారు.

విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు

ఏలూరు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఇందిరా నగర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాల బాలికలకు ఉచిత దంత పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. దంతాలను ఎలా పరిశుభ్రం చేసుకోవాలో డెమో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు చూపించారు. ఈ శిబిరంలో మాదేపల్లి జడ్పీ హైస్కూలు హెచ్ఎం వెంకట లక్ష్మి, దంత వైద్యులు పాల్గొన్నారు.

కలరాయునిగూడెంలో పశువులకు టీకాలు

లింగపాలెం, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య అన్నారు. మండలంలో కలరాయునిగూడెంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పశువులకు పరీక్షలు నిర్వహించి టీకాలు వేసినట్టు తెలిపారు. అనంతరం పాడి రైతులకు పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు బి.మహేష్, సూర్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

కుక్కునూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రతీ నిర్వాసితుడికి న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ అన్నారు. గురువారం పార్టీ సమావేశంలో మాట్లాడుతూ పోలవరం పరిహారం ఇచ్చినట్లే 45.72 కాంటూరు స్థాయిలో ఉన్న గ్రామాలకు కూడా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వయం చంద్రరావు, ఎస్.కె.మున్నీ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పత్సమట్ల

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పత్సమట్ల

నిడమర్రు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా పంట కాలువ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. గురువారం మందలపర్రు నుంచి క్రొవ్విడి వరకు పంటకాలువ గట్టు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కలగా మిగిలిపోయిన ఈ రోడ్డు నిర్మాణం వల్ల 8 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బి.జె.పి. నాయకులు, వీర మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు ఇ.శ్రామ్ పోర్టల్‌లో నమోదు కావాలి

ఏలూరు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్మికులు తమ వివరాలను ఇ శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న డీఎల్ఎస్ఏ భవనంలో భవన కార్మికులు, అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కార్మికులకు అందాలంటే ఇ శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు.



కోతకు గురైన ఉప్పుటేరు వెంబడి రహదారి

ప్రమాదకరంగా ఉప్పుటేరు రహదారి

గుంతలు పడి అధ్వానం.. తరచు రోడ్డు ప్రమాదాలు

కలిదిండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి రహదారి పలుచోట్ల కోతకు గురై ప్రమాదభరితంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మద్వానిగూడెం నుంచి పెదలంక వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర ఉప్పుటేరు మార్జిన్‌లో అక్రమ చేపల, రొయ్యల చెరువులను తవ్వడంతో ఉప్పుటేరు వెంబడి రహదారి కోతకు గురై గుంతలు పడి అధ్వానంగా మారి రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. పదిహేనేళ్ల కిందట ఈ రోడ్డును నిర్మించారు. ఇప్పటి వరకు ఈ రహదారిపై రోడ్డు ప్రమాదాల్లో పది మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. పలుమార్లు రోడ్డు మరమ్మతులు చేసినప్పటికీ అక్రమ చేపల, రొయ్యల చెరువుల కారణంగా రహదారి పాడైపోతుంది. చెరువుల్లో నీరు రహదారి పైకి వస్తుండడంతో పెద్ద గుంతలు పడుతున్నాయి. ఆ గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. ఉప్పుటేరు తీర గ్రామాలైన చినతాడినాడ, సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ, మద్వానిగూడెం, కొండంగి, పల్లిపాలెం, యడవల్లి, మట్టుగుంట,రబోడ్డువానిగట్టు, పెదలంక గ్రామాల్లో సుమారు 20 వేల మంది జనాభా నిత్యం ఈ రహదారి వెంబడి రాకపోకలు సాగిస్తుంటారు. వరదల సమయంలో ఉప్పుటేరు వెంబడి ఆక్రమణల కారణంగా రహదారి తరచూ కోతకు గురి కావడంతో ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణలతో ఉప్పుటేరు కుదించుకునిపోతోంది. ఉప్పుటేరు వెంబడి సింగిల్ రోడ్డు కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డబుల్ రోడ్డుగా విస్తరిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని పలువురు పేర్కొంటున్నారు.



అసంపూర్తి నిర్మాణంలో ప్రభుత్వ హెల్త్ క్లినిక్ భవనం.. భవనంలో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

హెల్త్ క్లినిక్ భవనంలో మద్యపానం, పేకాటలు

ముదినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో అసంపూర్తిగా నిర్మించిన ప్రభుత్వ హెల్త్ క్లినిక్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. భవనం నిర్మాణం పూర్తయినా తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయకపోవడంతో మద్యం ప్రియులకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. పగలు, రాత్రిళ్లు పేకాటలు ఈ హెల్త్ క్లినిక్ భవనంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. భవనంలోని గదుల్లో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు పడి ఉన్నాయి. ముదినేపల్లి - గుడ్లవల్లేరు ప్రధాన రహదారికి ఈ భవనం అందుబాటులో ఉండడం, చీకటి పడితే ఈ భవనం పరిసరాల్లో జనసంచారం లేక అసాంఘిక కార్యకలాపాలు నిరాటంకంగా నిర్వహించుకునేందుకు అవకాశం ఏర్పడింది. పక్కనే అసంపూర్తి నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయ భవనం కూడా అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది.



నూజివీడులో లోకేశ్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి



కైకలూరులో లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని, తదితరులు

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



కలిదిండి మండలం మట్టగుంటలో లోకేశ్ బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నూజివీడు/కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి/ముసునూరు/ నూజివీడు టౌన్/చాట్రాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తండ్రికి తగ్గ తనయుడిగా విజన్ ఉన్న నాయకుడు లోకేశ్ అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూజివీడు అడవి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు.

● కూటమి నాయ కులందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు ట్రావెలర్స్‌బంగ్లాలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు ఆర్థిక సహకారంతో పారిశుధ్య కార్మికులకు దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కైకలూరు పెద్దమసీదు వద్ద పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మి, బలే ఏసురాజు, తేరా రమేష్, మండల పార్టీల అధ్య క్షులు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, నారగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కలిదిండి మండలంలోని మట్టగుంట, చిన తాడినాడ గ్రామాల్లో టీడీపీ నాయకులు లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బర్త్ డే కేక్ కట్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అగ్నికుల క్షత్రి కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్ల రాజు, టీడీపీ ఉపాధ్యక్షుడు సోర్రా అరవింద్, మోకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● ముదినేపల్లిలోని ఎన్‌డీఏ కార్యాలయం, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులు లోకేశ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కామినేని ప్రారంభించగా, ఈ శిబిరంలో సుమారు 120 మంది రక్తదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పాల్గొన్నారు. ఎన్‌డీఏ కార్యాలయం వద్ద పేదలకు వస్త్రాలను అందజేశారు.

● మండవల్లి మండలం పెరికేగూడెం, భైరవపట్నం గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. అనంతరం పెరికేగూడెంలో సీసీరోడ్లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎన్డీయే నాయకులు సత్తిబాబు, ఎల్కే రాంబాబు, సజ్జా బాబి, భైరవపట్నం సాగునీటి సంఘం అధ్యక్షుడు బొల్లంపల్లి కృష్ణారావు, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి ఆధ్వర్యంలో గురువారం నూజివీడులో జరిగిన బైక్ ర్యాలీకి ముసునూరు మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. గోపవరం టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేష్, గుడిపాడు టీడీపీ నేత మండలపు ధర్మరాజు, ముసునూరు తెలుగు యువత నాయకుడు కొండేటి ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో బైక్‌లతో ర్యాలీగా తరలివెళ్లారు.

● నూజివీడులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. యువతను సమీకరించి వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడారన్నారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలకు చాట్రాయి మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.



నూజివీడులో లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన తదితరులు



ముదినేపల్లిలో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు వినోద్, విజయ్



కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

రహదారి ఆక్రమణల తొలగింపునకు చర్యలు

కైకలూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కైకలూరులో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు మెయిన్‌రోడ్డుపై ఆక్రమణలను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. గురువారం కైకలూరు తహసీల్దార్ కార్యలయంలో రెవెన్యూ, పోలీసు, ఎంపీడీవో, పంచాయతీ అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సిమెంట్‌రోడ్డుపై ఆక్రమణలు ఏమేరకు ఉన్నాయో రెవెన్యూ అధికారులు నిర్ధారిస్తే వాటిని తొలగిస్తామన్నారు. శుక్రవారం మెయిన్‌రోడ్డు వెంబడి ఆక్రమణలు గుర్తించే పనులను చేపట్టాలని కమిటీ నిర్ణయించారు.సమావేశంలో ఇన్‌చార్జి తహసీ ల్దార్ ఎండీ ఇబ్రహీం, ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర, టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ వెంకటకుమార్, ఆర్ఐ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ముదినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ముదినేపల్లికి చెందిన తంటేపూడి వందన కుమారి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందజేశారు. స్థానిక ఎన్‌డీఏ కార్యాలయం వద్ద ఆమె భర్తకు రూ.1.62 లక్షల చెక్కును అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సహాయం

ముదినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో అనారోగ్యంతో గురువారం మరణించిన యెండూరి వెంకటేశ్వరరావు (53) అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె తరఫున తండ్రి డాక్టర్ మనోజ్ రూ.5 వేలు నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉచిత పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



చిన్నంపేటలో పశువైద్య శిబిరం

చాట్రాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శివ నాగేంద్రబాబు కోరారు. మండలంలోని చిన్నంపేటలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 410 ఆవులు గేదెలు , 680 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 18 గేదెలకు చూడి పరీక్షలు జరిపారు. కోళ్ళ మందులు కూడా పంపిణీ చేశారు. స్థానిక నాయకులు కొమ్ము సుజనరావు, చింతా వెంకటేశ్వరరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమైన పశుసంపద కోసం ప్రభుత్వం కృషి



చెక్కపల్లిలో రైతులకు మందులను అందజేస్తున్న ఏడీ చంద్రశేఖర్‌రావు

ముసునూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువుకు వచ్చే వ్యాధులను రూపుమాపి ఆరోగ్యమైన పశుసంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నూజివీడు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం చెక్కపల్లి, యల్లాపురం గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాలను ఆయన తనిఖీ చేశారు. పశువుల్లో ఎక్కువగా వచ్చే గర్భకోశ వాధ్యులకు పరీక్షలు చేసి మందులు ఇస్తున్నామన్నారు. అలాగే జీవాలకు, దూడలకు నట్టల వ్యాధి నివారణ మందులు, బొబ్బ వ్యాధికి టీకాలను సైతం వేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు మొక్కపాటి మురళీకృష్ణ, తల్లిబోయిన రాధిక సత్యనారయణ, మాజీ ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారయణ, వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకట చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్పుచర్లలో విమలక్క వర్ధంతి



వేల్పుచర్లలో విమలక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ముసునూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీలో కడవరకు కొనసాగి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన అబ్బినేని విమలాదేవి జీవితం నేటి సమాజానికి ఆదర్శమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు. గురువారం వేల్పుచర్లలో విమలక్క స్మారక స్థూపం వద్ద ఆమె 16వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి సీపీఐ నాయకులు, గ్రామ ప్రముఖులు నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో పేదలకు 30 వేల ఎకరాలకు పైగా భూమిని పంచేందుకు ఆమె పోరాటం చేశారన్నారు. మాజీ ఎంపీటీసీ కాంద్రు శ్రీరామచంద్ర, ఎం.రాజ్‌కుమార్, మండల నాయకులు అబ్బూరి రంగరావు, నిమ్మగడ్డ నరసింహా, పరిమి రంగరావు తదితరులు పాల్గొన్నారు.



మర్లపాలెంలో బంతి పూల తోట

బంతిపూల సాగుతో రైతులకు లాభాలు

చాట్రాయి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కొందరు రైతులు బంతిపూలు సాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. మర్లపాలెం, మంకొల్లు తదితర గ్రామాల్లో బంతి పూలు సాగు జరుగుతున్నది. అయ్యప్ప పడిపూజలు, ఇరు ముడులు, సభలు సమావేశాలకు దండలు తయారీ, నాయకుల స్వాగత కార్యక్రమాలకు, శుభకార్యాలకు అలంకరణలకు బంతి పూలు భారీగా కొనుగోలు చేస్తుండటంతో మంచి డిమాండ్ వచ్చింది. దీంతో ఏటా బంతిపూల సాగు విస్తీర్ణం పెరుగుతోంది.



కైకలూరులో బోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని



నూజివీడులో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి నివాళి

నేతాజీకి ఘన నివాళి

కైకలూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతాజీ 127వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు మెంటే పార్థసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

కలిదిండి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కోరుకొల్లులో గురువారం బీజేపీ, జనసేన నాయకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశిరెడ్డి బలరామ్, చెన్నంశెట్టి మురళీకృష్ణ, కేశిరెడ్డి వేణు, సిహెచ్.మహంకాళి శ్రీనివాసరావు, సత్యనారాయణ, కె.రాజేష్, సిరిపురపు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు పట్టణంలో...

నూజివీడు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను నూజివీడు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ చూపిన తెగువ, ధైర్య సాహసాలను కొనియాడారు. బీజేపీ నాయకులు బోసుఅప్పారావు, ఎం.రాజశేఖర్, శివరాజు వసుంధరాదేవి, మాగంటివాసు, బావరాజు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో...

చాట్రాయి మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో గురువారం అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ హెచ్ఎం బక్కయ్య, పాఠశాల హెచ్ఎం వెంకట్రావు నేతాజీ వీరోచిత పోరాటం గురించి వివరించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ హసీనా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గోతుల కారణంగా ఛిద్రమైన రోడ్డు



గోతులతో అధ్వానంగా మారిన మర్లపాలెం రోడ్డు

పోలవరం - మర్లపాలెం రహదారి అధ్వానం

చాట్రాయి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట-పోలవరం ఆర్అండ్‌బీ రహదారి(ఆర్‌పీ రోడ్డు) పరిధిలో పోలవరం నుంచి మర్లపాలెం వరకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. 3 కిలో మీటర్లు రహదారిలో 300లకు పైగా గోతులతో ప్రజలు నరకం చూస్తున్నారు కూటమి ప్రభు త్వం సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు అంటూ ప్రకటనలు చేశారు. కానీ ఈ రోడ్డులో ఎక్కడా తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవు. పోలవరం, మర్లపాలెం, సోమవరం, కొత్తగూడెం, యర్రావారిగూడెం తదితర గ్రామాల ప్రజల ఈరోడ్డు నుంచే నూజివీడు వెళుతుంటారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహన చోదకులు కిందపడి గాయాలపాలు అవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గోతులైనా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

మంకొల్లులో 20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ నాగ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మంకొల్లులో దాడి చేసి 20 లీటర్ల సారా, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పారిపోయిన తాళం రాముపై కేసు నమోదు చేసినట్లు ప్రభుకుమార్ తెలిపారు. పోతనపల్లి చిన్న తండాలో జరిపిన దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేసి వడిత్యా సక్రుపై కేసు నమోదు చేశామన్నారు.

బస్సు డ్రైవర్లకు యూనిఫాం

నూజివీడు టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : రోడ్డుభద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నూజివీడు కుమార్ సీబీఎస్ఈ పాఠశాలలో పాఠశాల బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్సుల్లో అటెండర్లను విధిగా ఉంచాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. డ్రైవర్లకు పాఠశాల యాజమాన్యం నూతన యూనిఫాంను అందించారు.



బాధితులను పరామర్శించిన మంత్రి

మంత్రి ఆర్థిక సాయం

నూజివీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త తిరుమలశెట్టి సత్యం కుటుంబ సభ్యులకు మంత్రి పార్థసారథి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా టి.సత్యం మృతిచెందటంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

మంత్రి పరామర్శ...

ఆగిరిపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంత్రి పార్థసారథి నూగొండ పల్లిలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు. పిన్నమరెడ్డిపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు భార్య సుజాత అనారోగ్యంతో మృతిచెందారు. వారిని, వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు.